పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లి మండలంలోని శెట్టిపల్లి గ్రామం పెద్దబిడికిలో రూ.32 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం రెండు సమపాలల్లో జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం సెంట్రల్ జైల్ కోసం జైలు అధికారులు, రెవెన్యూ అధికారులతో కలసి పట్టణంలోనే రింగ్ రోడ్ వద్ద ప్రభుత్వ భూములను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పది ఎకరాలు స్థలంలో జిల్లా సెంట్రల్ జైలును అత్యాధునిక నూతన హంగులతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహా కుమార్, జిల్లా జైలు అధికారులు పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మ్యాపులను పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చర్చించేనా!

జిల్లా ప్రగతిపై సమగ్రంగా చర్చించడంపై సందేహం నెలకొంది. సుమారు ఏడాది కిందటి నుంచి వ్యవసాయ శాఖ నుంచి 12 ప్రధాన శాఖల చర్చను మధ్యాహ్నం రెండు గంటలకు పరిమితం చేయడం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. శనివారం జడ్‌పి చైర్మన్ రామగోవిందరెడ్డి అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. రబీ సీజన్‌లో నెలకొన్న తుపాన్ ప్రభావ పరిస్థితుల్లో ముందుకు సాగని సాగు, కదలని ఉక్కు పరిశ్రమ పనులు, సిఎం హోదాలో చంద్రబాబు ఇచ్చిన జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కేటాయింపులు, అరటి, చీనీ, బొప్పాయి, పత్తి ధరల పతనం వంటి కీలక సమస్యలపై లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది. జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్ విభాగాలకు వైద్య నిపుణులు, నర్సింగ్, టెక్నీషియన్స్ కొరతపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రబీ సమస్యలపై దృష్టి సారించాలి
కదలని ఉక్కు పరిశ్రమ పనులు
నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా రైతాంగం ధరల పతనం సమస్యతో సతమతమవుతోంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో తుపాన్ ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు ఊపందుకుంది. ఫలితంగా యూరియా, డిఎపి తదితర ఎరువులను అందుబాటులో ఉంచాల్సి ఉంది. రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, బుడ్డశనగ, మొక్కజొన్న పత్తి పంటలు ప్రధానమైనవి. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా అన్నమయ్య జిల్లాలో మోస్తరు వర్షాలు, కడప జిల్లాలో సాధారణ పరిమాణంలో వర్షాలు కురుస్తున్నాయి. ఆయకట్టు, మెట్ట ప్రాంతాల్లో సాగు ఊపందుకుంది. జిల్లా రైతులు పండించిన పంటలైన పత్తి, మొక్కజొన్న ధరల పతనం ఆందోళన కలిగిస్తోంది. అరటి, బొప్పాయి, చీనీ, ఉల్లి ధరలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ధరల స్థిరీకరణ నిధిని ఉల్లి రైతులకు సహాయం అందిస్తామన్న హామీ ప్రకటనలకే పరిమితమైంది. కడప జిల్లాలో 3.26 లక్షలు, అన్నమయ్య జిల్లాలో 68,367 ఎకరాల్లో పంటల సాగు ఊపందుకుంది. ఖరీఫ్‌లోని వరి, ఉల్లి, ఉద్యాన పంటలైన అరటి, చీనీ, బొప్పాయి, పత్తి, మొక్కజొన్న దిగుబడులన్నీ ఒక్కసారిగా రావడంతో ధరల కొరత ఏర్పడింది. ప్రభుత్వమే ఉత్పాదనలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్వారు చెర్వ పేరు వస్తోందని సంగతిని అధికారులు, రాజకీయ నాయకత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది. తల్లికివందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ బాధితుల ఆందోళన వ్యక్తం చేస్తుండడం తెలిసిందే. జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ, సైక్రియాటిక్, కేన్సర్ విభాగాలకు వైద్యనిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఆధునిక పరికరాల అవసరాల నియామకం చేపట్టడంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆశించిన ప్రయోజనం నెరవేర్చడం లేదనే విమర్శలు ఉన్నాయి. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు ఎప్పుడు చేపడతారో తెలియని పరిస్థితి నెలకొంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో కడప, హంద్రీ-నీవా నుంచి కుప్పానికి తరలించి కృష్ణాజలాలు, శ్రీనివాసపురం రిజర్వాయరుకు ఎందుకు మళ్లించలేదో తెలియని పరిస్థితి నెలకొంది. కడప కార్పొరేషన్‌లోని దేవుని కడప రూరాలి విస్తరణ పెండింగ్, నాలుగు స్టోమ్ డ్రెయిన్ పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వాసితుల మొరను ఆలకించే నాథుడే కరువయ్యారు. సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కెనాల్ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల నత్తనడకను సమీక్షించాలి. యురేనియం వ్యర్థాల నిర్వహణలోని టెయిల్ పాండ్ పటిష్టతను సమీక్షించాల్సి ఉంది. యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియలేదు.

ఉక్కు పరిశ్రమ నిర్మాణం దేవతావస్త్రాన్ని తలపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అధికార, ప్రతిపక్షాలు పోటీలు పడి ఇచ్చిన హామీల్లో ఉక్కు పరిశ్రమ ప్రధానమైంది. ప్రాధాన్య హామీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తోంది. మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఉక్కు పరిశ్రమ సామర్థ్య పరిమాణం, ఉత్పాదన, ఉపాధిని తగ్గించి జెఎస్‌డబ్ల్యు కంపెనీకి అప్పగించడం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన జడ్‌పిటిసి ఉపఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల్లో ఒకటైన ఒంటిమిట్టకు శ్రీరామ ఎత్తిపోతల పథకం పనుల పునరుద్ధరణకు నోచుకోలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైంది, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు ఆచరణలో జరుగుతున్నదేమిటనే చర్చ నడుస్తోంది. జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చాపాడులో ద్వితా తుపాన్ కారణంగా తడిసిన వరిధాన్యం

వెక్కిరిస్తున్న ఉక్కు స్థాపన శిలాఫలకం

విఆర్‌ఎల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విఆర్‌ఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామానుజులు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్, గ్రామ సేవకులు, విఆర్‌ఎల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు డి భాగ్యలక్ష్మి, విఆర్‌ఎ సంఘం జిల్లా అధ్యక్షులు కొరముట్ల సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా విఆర్‌ఎలకు ఒక్క రూపాయి కూడా వేతనం పెరగలేదన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అమలు చేయలేదన్నారు ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు అయినా విఆర్‌ఎల సమస్యలు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ మాదిరి పేస్కేల్ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అర్హత ఉన్నవారికి విఆర్‌ఒ, రికార్డ్ అసిస్టెంట్, ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అటెండర్, వాచ్‌మెన్, డ్రైవరు, పోస్టులకు 20 శాతం నుండి 70 శాతం ప్రమోషన్ కోటను పెంచాలని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నామినీలను రెగ్యులర్ చేయాలన్నారు. అక్రమ డ్యూటీలు రద్దు చేయాలని సర్వే పేరుతో ఇతర గ్రామాలకు వేయడం, బిఎల్‌ఒ పనులు, రద్దు చేయాలని ఖాళీ పోస్టులు భర్తీలో, నోటిఫికేషన్ విడుదలను ఆపి విఆర్‌ఎలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రికవరీ చేసిన డిఎ రూ.300 తిరిగి వారి అకౌంట్లో వేయాలని కోరారు.

నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు, సిఐటియు నాయకులు

అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తహశీల్దార్‌లతో జాయింట్ మీటింగు, నైట్ వాచ్‌మెన్ అటెండర్, డ్రైవర్ పోస్టులు, మదనపల్లి మాదిరిగా పోస్టులు భర్తీ చేయాలని కోరగా డిసెంబర్ ఆఖరి జనవరి మొదటి వారంలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘీభావంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సిద్దమ్మ, సురేఖ, విఆర్‌ఎ సంఘం, భోగేశ్వరయ్య, సిద్దేశ్వర, అల్లా బకష్, పెంచలయ్య, నరసింహులు, శివయ్య, రియాజ్, రామకృష్ణ, సుబ్బరాయుడు, రాజేంద్రప్రసాద్, ఇందిరమ్మ, రాజమ్మ, తులసమ్మ, రాయచోటి చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లి, పెనగలూరు రాజంపేట, నందలూరు, సుండుపల్లి, గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, సంబేపల్లి, తంబళ్లపల్లి, తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున విఆర్‌ఎలు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-చిన్నమండెం

చదువుకునే పిల్లల బంగారు భవిష్యత్తే ప్రభుత్వ ధ్యేయమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పండుగ వాతావరణంలో మెగా పిటిఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినిలు మంత్రికి పూలతో, కోలాటంతో స్వాగతం పలికారు. మంత్రి, కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి చిన్నారుల ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దూరదృష్టితో రాష్ట్ర విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్న లక్ష్యంతో మెగా పిటిఎం కార్యక్రమాన్ని వినూత్నంగా ప్రారంభించామని, దీని ద్వారా తల్లిదండ్రులు, గురువులు, విద్యార్థుల మధ్య బలమైన వంతెన ఏర్పడుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థుల భవిష్యత్తు బలపడుతుందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ, మొబైల్ ఫోన్ల ప్రభావం వల్ల పిల్లలు తప్పుదోవ పట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, ఇంటి నుంచి తల్లిదండ్రులు, పాఠశాల నుంచి ఉపాధ్యాయులు ఒకేసారి పర్యవేక్షణ చేస్తేనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, నిరంతరంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు నిర్వహిస్తూ పాఠశాలల్లో నేర్పిస్తున్న విషయాలు, విద్యార్థుల ఆవర్తన మరియు అభ్యాస స్థాయిలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తొమ్మిది, పదవ తరగతులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పునాది అని దాన్ని తేలికగా తీసుకోకూడదనీ సరైన గైడెన్స్, పర్యవేక్షణ లేక చదువు మానేసి తమ ప్రతిభకు విరుద్ధంగా చిన్న పనుల్లో నిమగ్నమవుతున్న ఉదాహరణలు చాలానే ఉన్నాయని, అలాంటివి జరగకుండా తల్లితండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు చర్యలు తీసుకొని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సుబ్రమణ్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మోడల్ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి

మండలంలోని సిబ్యాలలోని ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పిటిఎం కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహబంతి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సమయంలో పిల్లలతో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రవర్తించే తీరు ఎలా ఉంది, తరగతులు బాగా జరుగుతున్నాయా లేదా, పాఠశాలలో క్రీడలు, కళలు, సృజనాత్మక కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించబడుతున్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భోజనం యొక్క నాణ్యతను పరిశీలించి, విద్యార్థులు తీసుకునే ఆహారంపై వారి అభిప్రాయాలను స్వయంగా పిల్లలు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భనలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పేరెంట్, టీచర్ సమావేశంలో పాల్గొని విద్యార్థుల విద్యా పురోగతి, హాజరు, అభివృద్ధి, ప్రవర్తన తదితర అంశాలపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన విధానం, బోధన ప్రభావం, పరీక్షా ఫలితాలపై సమగ్ర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న విద్యా పరిరక్షణ చర్యలు విద్యార్థులకి సక్రమంగా చేరేలా చూడటం ఉపాధ్యాయుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య పొందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పాఠశాల శుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, అందుకే విద్యా హక్కు మాత్రమే కాకుండా, సమగ్రాభివృద్ధి హక్కు కూడా వారికి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల మానసిక, శారీరక వికాసం కోసం క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి వారం ఏర్పాటు చేసి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు, పాఠశాల ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

వేతనాలు చెల్లించకపోతే ఉద్యమిస్తాం

- నిరసనలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి

ప్రజాశక్తి-రాజంపేట

వేతనాలు చెల్లించకపోతే ఉద్యమిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో వేతనాలు చెల్లింపు నిర్లక్ష్యంపై ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయమ్మ, చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. బ్యాంకు ఖాతా మార్చడం వలన సమస్య ఏర్పడిందని అధికారులు తెలుపుతున్నప్పటికీ, అవే బ్యాంకు ఖాతాలు కలిగిన రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న మిగతా అంగన్వాడీలకు వేతనాలు జమయ్యాయని పేర్కొన్నారు. రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని వారికే ఈ సమస్య ఏమిటని ప్రశ్నించారు. నాలుగు రోజులలో వేతనాలు జమ అవ్వకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఎల్లాగడ్డ అంగన్వాడీసహాయకులు సమస్య కూడా పరిష్కరించాలని, లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ఈశ్వరమ్మ, విజయమ్మ, శివరంజని, అమరావతి, విజయ, వనిత, స్వర్ణ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తిమదనపల్లె అర్బన్ : బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని పోర్డ్ సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా ఒక వీడియోను స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ సమాజంలో టెక్నాలజీ పెరిగినప్పటికి బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉండడం వల్ల 10వ తరగతిలోనే ప్రేమ అంటూ ఇంటి నుండి వెళ్లిపోవడం వల్ల తల్లితండ్రులు అడ పిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేస్తున్నారన్నారు. బాల్య వివాహాలపై పిల్లలు, పెద్దలకు పరిపూర్ణ అవగాహన కల్పించాలనే ఆలోచనతో వీడియోల ద్వారా చైతన్యం తీసుకురావడం కోసం పోర్డ్ సంస్థ తక్కువ నిడివి గల వీడియోను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోర్డు డైరెక్టర్ జల్లా లలితమ్మ, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ చౌదరి, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సుభాషిణి, నరసింహులు పాల్గొన్నారు.

7న పెనగలూరులో జూడో ఎంపికలు

ప్రజాశక్తి-రాజంపేట : ఈనెల 7వ తేదీ ఆదివారం పెనగలూరు లోని ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో క్యాడెట్, జూనియర్ విభాగాలలో బాల బాలికలకు జూడో ఎంపికలు నిర్వహించనున్నట్లు జూడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సి.వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాడెట్ విభాగంలో 2008-2010లో జన్మించి ఉండాలని, జూనియర్ విభాగంలో 2005-2010 మధ్యన జన్మించిన వారు అర్హులని తెలిపారు. పోటీలో పాల్గొనదలచినవారు ఆదివారం ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం తీసుకొని ఇనారేట్ జీసస్ హై స్కూల్ కు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9848267126 నెంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

వృద్ధులకు స్వెటర్లు పంపిణీ

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్: ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చైతన్య సంస్థ వ్యవస్థాపకులు ఎంపీ ఆనందన్ స్వెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రెటరీ కవిత రాణి మాట్లాడుతూ ఎంపీ ఆనందన్‌కు వారి తల్లి భాగ్యలక్ష్మమ్మ అంటే మిక్కిలి ఇష్టం, గౌరవమని తెలిపారు. ఆమె తనువు చాలించే సమయంలో వృద్ధాప్యంలో ఇబ్బంది పెడుతున్న వృద్ధులను ఆదుకునేందుకు వృద్ధాశ్రమాన్ని స్థాపించాలని కుమారుడిని కోరగా, ఆమె జ్ఞాపకార్థంగా ఏర్పడినదే ఈ ఆనంద వృద్ధాశ్రమని తెలిపారు. కార్యక్రమంలో ఆనందన్ తన తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వృద్ధులకు స్వెటర్లు అందజేశారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి రాయచోటి అర్బన్: అన్నదానం మహా పుణ్య కార్యక్రమానికి లైన్స్ క్లబ్ రాయచోటి టౌన్ రీజనల్ చైర్మన్ షేక్ మహమ్మద్ అన్నారు. పట్టణానికి చెందిన బండపల్లి బసన్న వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు భాను ప్రసాద్, భాను ప్రకాష్ ఆర్థిక సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం కార్యక్రమం జరిగింది. పట్టణ శివారులలో గుడిసెలలో నివసిస్తున్న పేదలకు క్లబ్ సభ్యులు అన్నం పొట్లాలను అందజేశారు. అనంతరం దాతలు బండపల్లి భాను ప్రసాద్, బండపల్లి భాను ప్రకాష్ మాట్లాడుతూ రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి మా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి, జి.రామ్ కుమార్ పాల్గొ న్నారు.

అమ్మ చేతి వంటలే అమృతం : ఎంఇఒ

ప్రజాశక్తి-రాజంపేట: అమ్మ చేతి వంటలే అమృతమని ఎంఇఒలు రఘునాథ రాజు, సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో కరస్పాండెంట్ నందకిషోర్ ఆధ్వర్యంలో మాస్టర్ చెఫ్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. 100 మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విభిన్నమైన, ప్రకృతి సిద్ధమైన ఆహార పదార్థాలు, వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ వీధుల్లో విక్రయించే ఆహారం తీసుకోకూడదని, అమ్మ చేతి వంటలు ఆప్యాయత ఉంటుందని, ఇంటిలో ప్రకృతి సిద్ధంగా వండుకునే వంటల్లోనే పోషకాలు లభిస్తాయని తెలిపారు. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కరస్పాండెంట్ నందకిషోర్ నిర్వహించే విభిన్న కార్యక్రమాలు మిగతా అన్ని పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. కరస్పాండెంట్ నందకిషోర్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చిన్నతనం నుండే సృజనాత్మకతతో పాటు సేవా కార్యక్రమాల పట్ల స్పృహ కలిగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజులు, ఉపాధ్యాయులు భాగ్య, స్రవంతి, సబిహా, మెహతాబ్, షాహిన, కాలేషా పాల్గొన్నారు.

కార్మికులకు తృటిలో తప్పిన ప్రమాదం

- అధికలోడు వల్ల పైకి లేచిన ట్రాలీ
- కమిషనర్ ఒత్తిడే కారణమంటున్న కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట

శుక్రవారం పారిశుధ్య కార్మికులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. డ్రైవర్ జి.గంగయ్య, సహాయకుడు రమేష్ రాజంపేట పురపాలక పరిధిలో చెత్తను సేకరించి పాలెం కంపోస్టు వద్దకు వెళ్లగానే సామర్థ్యానికి మించి లోడు వేయడం వలన అకస్మాత్తుగా ట్రాలీ లేచి పైకి నిలబడడంతో వెంటనే అప్రమత్తమై డ్రైవర్‌తోపాటు సహాయకుడు కూడా కిందికి దూకేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారు కిందికి దిగలేక వాహనం బోల్తా పడి ఉంటే ఊహించని ప్రమాదమే జరిగి ఉండేది.

కమిషనర్ ఒత్తిడే కారణమంటున్న కార్మికులు : ట్రాలీ ఆటోలో ఎక్కువ చెత్తను తీసుకెళ్లాలని అధికారులు కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల ఒత్తిడి కారణంగా కార్మికులు అధికలోడుతో చెత్తను తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధిక లోడుతో చెత్తను తీసుకెళ్లాలని కమిషనర్ పలుమార్లు ఒత్తిడి చేశారని అనుకోని ప్రమాదం జరిగితే తమపై ఆధారపడి జీవించే కుటుంబం పరిస్థితి ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏ ప్రమాదమైన జరిగితే అందుకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అధిక లోడు వలన పైకి లేచిన వాహన ట్రాలీ

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అక్కడికక్కడే పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నందు ప్రజల సమస్యల పట్ల ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి ప్రజాదర్బార్ పేరిట ప్రజా సమస్యలు పరిష్కరించడానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రజల తక్షణ పరిష్కారం చూపే విధంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ సుబ్బనరసయ్య నాయుడు, టిడిపి మండల రూరల్ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, సొసైటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి జి.వి.సుబ్బారాజు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం మస్జిద్‌లలో ప్రార్థనల అనంతరం మండల కేంద్రంలోని ముస్లింలు పాత బస్టాండు కూడలికి చేరుకొని మానవహారంగా ఏర్పడి రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, ముస్లిం సోదరులు మాట్లాడుతూ చారిత్రకంగా, మౌలిక వసతుల పరంగా, నైసర్గికంగా అన్ని అర్హతలు కలిగిన రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని, ఎన్నికలవేళ చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో వందలాది మంది ముస్లింలు, జెఎసి నేతలు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దిత్వా తూపాన్ కారణంగా వర్షాలతో నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని, ఉపాధి హామీ పథకం ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీర భాస్కర్ అన్నారు. శుక్రవారం మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు గుంత మగ్గాలపై పూర్తిగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. 10 రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మగ్గాలు తడిసి ముద్దయ్యాయని, పనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరాఉ. కార్యక్ర మంలో ఎపి బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాదినేని రమేష్ నాయుడు, కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్ జాన్, రమేష్, శంకర్, రాజా, శాంతి, ప్రవీణ్ కుమార్, డి.గంగాధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

మదనపల్లె : మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని ఉర్దూ పాఠశాల, జడ్‌పి హైస్కూల్, వివేకానంద మున్సిపల్ హైస్కూల్, గురుకుల పాంశాల, బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్ కి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాంశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాలు మెరుగు, మధ్యాహ్న భోజనంలో నాణ్యత వంటి అంశాలపై చర్చించడానికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెగా పేరెంట్స్ మీట్ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. పేద విద్యార్థుల చదువు భారం కాకూడదనే గొప్ప సంకల్పంతో మంత్రి నారా లోకేష్‌బాబు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి ఇంటిలో ఎంతమంది చదువుకుంటున్నారో అందరికీ తల్లి ఖాతాలలోకి ఒక్కొక్కరి ప్రభుత్వం రూ.13 వేలు జమ చేస్తోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి:** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ అజంతుల్లా తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్లో క్రమశిక్షణ, పెద్దలను గౌరవించే విధానాన్ని తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్యాం సుందర్ రెడ్డి, అరుణమ్మ చంద్రశేఖర్ చంద్ర శేఖర్‌రెడ్డి, రమేష్‌రాజు, భాస్కర్, ప్రసాద్, రాధాకృష్ణ, చంద్రకళ, వసుంధర పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశ కార్యక్రమాన్ని మండలంలోని పాఠశాలల్లో, ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించినట్లు ఎంఇఒ పద్మావతి నారాయణ లు తెలిపారు. జడ్‌పి హైస్కూల్లో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్ర మంలో రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జెవెంకటేష్, ప్రిన్సిపల్ శ్రీధర్, ప్రియదర్శిని, ఎన్ఎస్ఎస్ ట్రైనర్ వెంకట గోపాల్, హెచ్‌ఎంలు, ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, సర్పంచులు, నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని బావికాడిపల్లి హైస్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ప్రధానోపాధ్యాయుడు జి వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి -2 నాగ తిరుమలరావు హాజరయ్యారు. శనివారం నుంచి మొదలవుతున్న పదవ తరగతి విద్యార్థుల వంద రోజుల కార్యచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేసి అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. **రామాపురం :** విద్యార్థుల వికాసానికి అభివృద్ధికి ఉపాధ్యాయుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎంపిడిఒ జాషువా పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ శ్యామలాదేవి అధ్యక్షతన మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. సమావేశాని మండల టిడిపి అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ2 జయచంద్రడు, స్కూల్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **రాజంపేట :** ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మధ్య అవగాహనతో కూడిన సత్సంబంధాలు మెరుగు పరిచేందుకే మెగా సమావేశం దోహదపడుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని బోయనపల్లెలో పిఎం ఎస్‌జెఎస్‌ఎం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భారతి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి స్కూల్ కమిటీ చైర్మన్ అధ్యక్షతన పండుగ వాతావరణంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు జానపాటి బాల యానాదయ్య, ఎఎంసి చైర్మన్ సుబ్బనరసయ్య నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు రఘునాథరాజు, సుబ్బరాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, శివనారాయణ చౌదరి, నాయకులు పాల్గొన్నారు. **చిట్వేలి:** మండల పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీ రాష్ట్ర చైర్మన్ కెకె.చౌదరి పాల్గొన్నారు. మెగా పేరెంట్స్ డే ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నా చిన్ననాటి పాఠశాల తనమిత్రుడు దుర్గరాజు ప్రధానోపాధ్యాయుడు కావడం పాఠశాల అభివృద్ధికి ఎంత దోహదప డుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామానుజుల నాయుడు, కాకర్ల సుబ్బరాయుడు, న్యాయవాది బాలాజీ పాఠశాల చైర్మన్ శంకర్ రాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కలికిరి :** జడ్‌పి హైస్కూల్‌లో పంచాయతీ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ రెడ్డివారి యోగేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాలతి, రిటైర్డ్ టీచర్ రమేష్ పాల్గొని విద్యార్థిని విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. పాఠశాలలోని మూడు తరగతి గదులకు ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం యోగేష్ రెడ్డి కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** మండలం బీరంగి జడ్‌పి హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ వి.శ్రీనాథ్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎన్.రెడ్డెప్ప, వైస్ చైర్మన్ లక్ష్మీదేవి, సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పి టి.రమేష్ పాల్గొన్నారు. **కలకడ:** విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల పాత్ర కీలకమైనదని తహాశీల్దార్ మహేశ్వరి బాయి, ఎంఇఒ మునీంద్ర నాయక్ పేర్కొన్నారు. ఎపిమోడల్ స్కూల్ కలకడ (ఉర్దూ, తెలుగు) కోన జడ్‌పి హైస్కూల్‌లో మెగా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల సిబ్బంది, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **సుండుపల్లి :** కస్తూర్బా గాంధీ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ మీట్‌కు ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి చప్పిడి మహేష్‌నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు చప్పిడి రమేష్‌నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శిలు, కోశాధికారులు,గ్రామ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **నందలూరు :** విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ఉంటుందని అందుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని ఎస్ఐ మల్లికార్జునెడ్డి, మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ పేర్కొన్నారు. ఆడపూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హైమావతి, పాఠశాల చైర్మన్ మురళి, పశు వైద్యాధికారి మాధవి లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **నాగిరెడ్డి పల్లెలో..** నాగిరెడ్డిపల్లె జడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహాశీల్దార్ అమరేశ్వరి, ఎంఇఒఅనంతకృష్ణ హాజరయ్యారు. **నల్లతిమ్మాయపల్లె జడ్‌పిహైస్కూల్‌లో..** మండలంలోని నల్లతిమ్మాయపల్లె జడ్‌పి హైస్కూల్‌లోమెగా పేరెంట్స్ సమావేశాన్ని హెచ్‌ఎం బి.వెంకటేశ్వర్లు, కమిటీ చైర్మన్ చెంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు, దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సాహెబ్‌జాన్, సిభావతుల్లా, రఘుప్రసాద్, నిత్యపూజయ్య, తేజ,ఆయేషా, ఫర్హానాపాల్గొన్నారు. విద్యార్థుల ప్రగతిని తెలియజేస్తూ తల్లిదండ్రులకు హోలిస్టిక్ కార్డులను అందించారు. కార్యక్రమంలో మైస్కూల్ మై ప్రైడ్ ప్రత్యేక అధికారి వెంకటరమణ, అనంతకృష్ణయ్య, గ్రామ సర్పంచ్ గీతాల శిరీష, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట : విద్యార్థులకు జ్ఞాపికను అందిస్తున్న జగన్‌మోహన్‌రాజు



నందలూరు : తల్లిదండ్రులకు హోలిస్టిక్ కార్డును అందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఇఒ మునీంద్రనాయక్

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి- కలకడ

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని ఎంఇఒ ఎం.మునీంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం కలకడ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ క్రమాలు చేపడతోందన్నారు. వీటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాలు, రవాణా భత్యం, స్టైఫండ్, ఎస్కార్ట్ అలవెన్స్, చిన్న పాటి శస్త్ర చికిత్సలు లాంటి కార్యక్రమాలు చేపడుతుందని వీటిని సద్విని చేసుకొని తమ పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి ప్రతి ఒక్కరికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మావతి, సహిత ఉపాధ్యాయులు ఎం.లక్ష్మి, విశ్వనాథ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి

ప్రజాశక్తి-రామాపురం

తన కుటుంబానికి జీవనాధారమైన గేదెను శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో మృతి చెందిన చెప్పిడి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. తమ కుటుంబం పాలు అమ్ముకొని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారని వారన్నారు. తమ కుటుంబ పోషకుని ఆధారం మైన రూ.70 వేలు విలువ చేసే గేదె మృతి చెందడంతో కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందుకోవాలని వేడుకున్నారు.

కార్యకర్త మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని రామాపురం గ్రామం గంగిరెడ్డిగారిపల్లితో వైసిపి కార్యకర్త సుంపపల్లి ఆనంద్(48) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆనంద్ మృతదేహానికి నివాళి అర్పించారు. వైసిపి కార్యకర్తగా పార్టీ అభివృద్ధి నుండి పార్టీ కోసం విశేషంగా శ్రమించారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు.

మరుగుదొడ్లు పూర్తి చేయాలని నిరసన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్ : మండలంలోని మాలేపాడు గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యను తీవ్రంగా ఉందని పరిష్కరించాలని కోరారు. పాఠశాలలో సరైన మరుగుదొడ్లు సౌకర్యం లేకపోవడం వల్ల ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ అమ్మాయిలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్యపరంగా ఇది ఎంతో ప్రమాదకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి మరుగు దొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా తల్లిదండ్రుల అభిప్రాయాలను సమర్థిస్తూ, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత కోసం మరుగుదొడ్ల నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి, చర్యలు తీసుకొని పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ జి.భార్గవి, వైస్ చైర్మన్ పుల్లా ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎడిఎ, ఎఒ

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలో శుక్రవారం పీలేరు ఎడిఎ రామన్‌రావు, ఎఒ రమణకుమార్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మన గ్రోమోర్ పుడమి కిసాన్, జై కిసాన్ ఎరువు దుకాణాల్లో రికార్డులు, ఎరువుల నిల్వ తదితర అంశాలను పరిశీలించారు. రైతులకు కొనుగోలు చేసిన ప్రతిదానికి రశీదు కచ్చితంగా ఇవ్వాలన్నారు. ఎక్కడైనా నాసిరకం విత్తనాలు కానీ, ఎరువులు మందులు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు అన్నదానం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో భైరవగుట్ట శ్రీఆంజనేయస్వామి గుడి వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాధురి స్కూల్ కరస్పాండెంట్ రేపన సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధురి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని 12 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలంతా అన్నదాత కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్ట్ (సీనియర్ డివిజన్), రాజంపేట

E.P. No.25/2025
I.A.No. 154/2023
HMOP No. 36/2020

యల్లంకి ఏ కురుగుంట్ల స్వర్ణలత, భర్త కే.సురేంద్రబాబు, వయసు 34 సం॥, హిందూ, గృహిణి, నివాసము డోర్ నెం. 8/36-A, రామాపురం గ్రామం & పోస్ట్, దువ్వూరు మండలం, కడప జిల్లా, ఆంధ్ర ప్రదేశ్. ...D.Hr

Vs

కురుగుంట్ల సురేంద్రబాబు తండ్రి కే.సుబ్బరాయుడు, వయసు 36 సం॥, హిందూ, నివాసము డోర్ నెంబర్ 6-969, నారాయణాద్రి నగర్, రాజంపేట టౌన్ అండ్ మండల్, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్. ...J.Dr.

J.Drకి నోటీసు

పై నెంబర్ E.P. లోని D.Hr., J.Dr. అయిన నీపై మెయింటెనెన్స్ ఆర్డర్ అమౌంట్ రికవరీ కోరుతూ పైకోర్టులో పై EP దాఖలు చేసి ఉన్నారు. కావున మీరు 31.12.2025 తేదీ ఉదయం 10:30 ని॥ స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై ఆక్షేపనలుఉన్న ఎడల తెలుపుకోవలసినది, లేనంతట పై EP మీ పరోక్షంగా తీర్మానించబడును.

//By Order of the Court//
T. RAGHUNATH REDDY
Advocate, RAJAMPETA.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలం,కొత్తపల్లి ప్రాంతానికి చెందిన షేక్ మొహమ్మద్ జానీ, తండ్రి షేక్ ఇస్మాయిల్‌కు చెందిన **S7090292** నెంబరు గల పాస్పోర్ట్ 17/09/2018, విజయవాడ వారిచే జారిచేయబడిన పాస్పోర్ట్ పోయినది. నేను రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో నా వ్యక్తి గత పని కోసం కడప కు వెళ్లడానికి బస్సు కోసం వేచి ఉండగా నా ఒరిజినల్ పాస్పోర్ట్ పోగొట్టుకున్నాను. ఇది నా మొదటి పాస్పోర్ట్ దొరికిన చో తెలపగలరు. **షేక్ మొహమ్మద్ జానీ, తండ్రి షేక్ ఇస్మాయిల్, ఇంటి నెంబర్ 14/122, మహబూబ్ నగర్, కొత్తపల్లి, రాయచోటి మండలం అన్నమయ్య జిల్లా. సెల్ : 8186969497.**

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వ భూములను ఆక్రమించినా, ఆక్రమించడానికి ప్రయత్నించిన వారు ఎంతటి వారైనా సరే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తహశీల్దార్ తపస్వని అన్నారు. వివరాల్లోకి వెళితే.. రెడ్డివారిపల్లె పంచా యతీలోని సర్వేనెంబర్ 1037లో 88.72 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. బాలేవాండ్లపల్లెకు చెందిన లేట్ బాలే రామన్న కుమారుడు లేట్ బాలే వెంకటరమణకు ప్రభుత్వం ఇదే సర్వే నెంబర్లు గుట్టలో పట్టా భూమి ఇచ్చిందని వెంకటరమణ కుమారుడు బాలే నారాయణ, బాలే రేణుక తెలిపారన్నారు. ప్రస్తుతం రెడ్డివారిపల్లి గ్రామంలో భూమి రీసర్వే జరుగుతున్న తరుణంలో నారాయణ, బాలే రేణుక కలిసి గురువారం అయ్యవారిపల్లి వద్ద ఉన్న వెలమ బోడిగుట్ట నల్లగుట్ట వద్ద తమకు భూమి ఉందని అనుకొని అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని సుమారు నాలుగు ఎకరాలు చదును చేయడం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ తపస్విని వెంటనే రెవెన్యూ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వ భూమిని చదును చేసినట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించిన వారిని హెచ్చరించడం జరిగిందన్నారు. అనంతరం సంఘటన స్థలంలో సర్వేనెంబర్ 1037లో 88.72 ఎకరాల ప్రభుత్వ భూమి కలదని, ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించడానికి ప్రయ త్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డును రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, విఆర్ఓ నాగరాజా శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, విఆర్ఓ నాగరాజా, విఆర్ఎ చిన్న రెడ్డప్ప పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.మంజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యునైటెడ్ నేషన్స్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ వారు ఈ ప్రపంచ నేలల దినోత్సవాన్ని జరిపి సూచనలు ఇచ్చారని, అన్ని దేశాలు ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నాయని తెలిపారు. ఈ యేడాది 'ఆరోగ్య వంతమైన నేలలు-ఆరోగ్యమైన పట్టణాలు' అనే అంశాన్ని ఖరారు చేశారని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు ఆహారాన్ని అందించే దిశలో గడిచిన 5-6 దశబ్దాలలో విరివిగా కృత్రిమ ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల నేలలు అన్నీ కలుషితమై వాటి సహజ గుణాలను కోల్పోయి నేల ఆరోగ్యం క్షీణించిందని కాబట్టి సేంద్రీయ పద్ధతులను పాటించి నేలల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రైతులకు, విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత తరుణంలో విపరీతమైన వాతావరణ మార్పులు కారణంగా నేలలు, పంటలు, వాతావరణం, జీవరాశులు దెబ్బతింటున్నాయని, పట్టణాలు వరదల కారణంగా జలమయం అవుతున్నాయన్నారు. చెట్లు నాటి పచ్చదనాన్ని పెంచి, ఎక్కడ నీరు అక్కడ ఇంకేటట్లు పట్టణాలలో ప్రణాళికలు రూపొందించాలని తద్వారా పట్టణాల్లో నేలలు, కూడా ఆరోగ్యవంతంగా మారి, ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకునే శక్తిని పొందుతాయని పేర్కొన్నారు. సేద్య విభాగ శాస్త్రవేత్త సోమశే ఖర్‌బాబు మాట్లాడుతూ మనదేశంలోని వివిధ రకాల నేలల రకాల గురించి తెలు పుతూ జిల్లాలో ఎర్ర నేలలు, ఎర్ర రేగడి నేలలు ఎక్కువగా విస్తరించి ఉన్నాయన్నారు. జిల్లాలోని నత్రజని తక్కువ లభ్యతగా, భాస్వరం మధ్యస్థం నుండి ఎక్కువగా, పొటాషియం మధ్యస్థంగా మరియు సూక్ష్మపోషకాలలో జింకు లోపం ఉందన్నారు.భూసార పరీక్ష ప్రాముఖ్యత గురించి వివరిం చారు. పచ్చిరొట్ట ఎరువులు, అజోల్లాలాంటి, జీవన ఎరువులు ఖచ్చితంగా పంటలలో వాడి నేల ఆరోగ్యం కాపడుకోవాలని తెలిజేశారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కెవికె సిబ్బంది, రైతులు, కెవికెలో శిక్షణ పొడుతున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సోమశేఖర్‌బాబును సన్మానిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

'మిట్స్'లో సాంకేతిక విద్యపై జాతీయ స్థాయి వర్క్‌షాప్

మాట్లాడుతున్న విసి యువరాజ్

ప్రజాశక్తి- మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ప్రభుత్వ, ప్రయివేట్ పాలిటెక్నిక్ కాలేజీల అధ్యాపకుల కోసం 'అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్' పై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, పాలిటెక్నిక్ అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు. విసి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల విద్యా నాణ్యతను పెంపొందించడంలో ఎన్‌బిఎ, న్యాక్ గుర్తింపు ఎంతో కీలక మ న్నారు. ఎన్‌బిఎ ప్రధానంగా టెక్నికల్ ప్రోగ్రామ్‌లకు గుర్తింపునిస్తూ కోర్సులు అవు ట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ విధానంలో నడుస్తున్నాయా అనే అంశంపై ద ృష్టి పెడుతుందన్నారు. న్యాక్ గుర్తింపు మాత్రం మొత్తం సంస్థ పనితీరును అంచనా వేసి, పాఠ్య ప్రణాళిక, బోధన-అభ్యాసం, పరిశోధన, మౌలిక వసతులు, విద్యార్థి సేవలు వంటి అంశాలను పరిశీలించి రేటింగ్ ఇవ్వడం ద్వారా గుర్తింపు పొందిన కళాశాలలకు పరిశ్రమలతో అనుబంధం పెరగడం, ఉద్యోగావకాశాలు మెరుగు పడడం, ప్రభుత్వ నిధులు పొందే అవకాశం పెరగడం వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు పాఠాలు బోధించడమే కాకుండా విద్యా ర్థులు ఎంత వరకు అర్థం చేసుకున్నారో తెలియడం ద్వారా బోధనా నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు బోధనా విధానాల్లో నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల నేర్పుదల పద్ధతులు, కోర్స్ అవుట్‌కమ్, ప్రోగ్రామ్ అవుట్‌కమ్ రూపకల్పన, అకడమిక్ అక్వాలిటీ మెరుగుదల వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల నుంచి 80మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రదర్శనకు వేదికగా..మెగా పేరెంట్స్ మీట్

-వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కిషోర్‌దాస్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ సమావేశం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కాకుండా టిడిపి నాయకుల రాజకీయ ప్రదర్శన వేదికగా నిర్వహిస్తున్నారని వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్‌దాస్ ఒక ప్రకటనలో విమర్శించారు.వైసిపి పాలనలో నాడు-నేడుతో పాంశాలల సుందరీకరణ, ఇంగ్లీష్ మీడియం, మానిటర్లు, ట్యాబ్లు, తాగునీటి ప్లాంట్లు, పౌష్టికాహారం వంటి విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ప్రభుత్వ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క బడికి కూడా కొత్త అభివృద్ధి పనులు జరగలేదని, పేద పిల్లలకు తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సిఎం, మంత్రులు కూర్చున్న ఫర్నిచర్ కూడా గత ప్రభుత్వమే అందించినదన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి ప్రయో జనం లేకుండా జరుగుతున్న ఈ "మెగా పేరెం ట్స్ మీటింగ్ అసలు 'దగా సమావేశం'గా మారిందని విమర్శలు చేశారు.

పాడైన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలి

- డిస్కంచీఫ్ జనరల్ మేనేజర్ జానకిరామ్

ప్రజాశక్తి-పీలేరు

పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు తక్షణ మరమ్మతులు చేపట్టి వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని డిస్కం చీఫ్ జనరల్ మేనేజరు సీహెచ్ జానకిరామ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక తిరుపతి మార్గంలోని ఎంఎన్ఆర్ మినీ ఫంక్షన్ హాల్లో పీలేరు నియోజవర్గంలోని విద్యుత్తు అధికారులు, సిబ్బందితో సిజిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఒక్క రోజు విద్యుత్తు సరఫరా ఆగినా పంటలకు నష్టం జరుగుతుందని, అందుకు గ్రామీణ ప్రాంతాల్లోని ఉప కేంద్రాలను, ట్రాన్స్‌ఫార్మర్లను ప్రతి నెలా తనిఖీ చేసి, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యుత్తు చార్జీలను తగ్గించే క్రమంలో కేంద్రం అమలు చేస్తున్న పిఎం సూర్యాఘర్‌ను క్షేత్రస్థాయిలో వినియోగదారులకు వివరించి, ఎక్కువ ముంది రాయితీల్లో సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసుకునేలా చూడాలని దిశా, నిర్దేశం చేశారు. రైతులకు సీనియారిటీ ప్రకారం వ్యవసాయ సర్వీసులను ఇవ్వాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. 33కెవి, 11కెవి విద్యుత్తు ఉపకేంద్రాలను నిర్ణయించిన తేదీల్లో తనిఖీ చేసి మరమ్మతులు అవసరమైన పక్షంలో విధిగా వినియోగదారులకు తెలియజేసి బాగు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిరక్ష్యం వివహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రాయచోట ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ సోమశేఖరరెడ్డి, పీలేరు ఇఇపై చంద్రశేఖరరెడ్డి, డివైఇ అమీర్‌బాష, పీలేరు డివిజన్ పరిధిలోని ఎఇలు పాల్గొన్నా రు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

ప్రజాశక్తి-వీరబల్లి

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు వీధులలో నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు, పల్లెల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వంటివి వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మట్లి పంచాయతీ ఎల్లంపల్లిలో వర్షపు నీరు వీధులలో నిల్వ ఉండడం కారణంగా ప్రాథమిక పాఠశాల ఎదుట నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పాడి పశువులు గ్రామాల్లో అధికంగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడు పారిశుధ్యం పూర్తిగా లోపించి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు చూచి చూడనట్టు పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ సర్పంచ్ సోమారపు నాగార్జునచారిని వివరణ కోరగా తాను అనేక సార్లు మండల స్థాయి అధికారులకు పారిశుధ్యం, వర్షపు నీరు, నిల్వ విషయాలను తెలిపానని కానీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదని తెలిపారు.

ఎల్లంపల్లిలో ఎంపిపి స్కూల్ వద్ద చెరువుల తలపిస్తున్న రోడ్డు

క్రైం కార్నర్

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో డ్రైవర్ పై ప్రత్యర్థి కత్తితో గొంతు కోసి హత్యా యత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ సంఘటన గురువారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పుంగనూరు రోడ్డు, కనుమలో గంగమ్మగుడి సమీపంలో నివాసముంటున్న శేఖర్‌బాబు కుమారుడు రెడ్డిశేఖర్ సొంతంగా ఆటో నడుపుకుంటూ జీవనం చేస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలో చెంబకూరు రోడ్డు, రాగిమాను వద్ద ఉన్న నాన్నమ్మ లక్ష్మిదేవి వద్దకు వెళ్ళాడని తెలిపారు. స్థానికంగా ఉంటున్న తరుణ్ అనే వ్యక్తి రెడ్డి శేఖర్‌తో అమర్యాదగా వ్యవహరించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఆగ్రహించిన తరుణ్ తన వద్ద ఉన్న బ్లేడ్‌తో రెడ్డిశేఖర్ గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. చుట్టుపక్కల వారు రావడంతో పరారయ్యాడని తెలిపారు. స్థానికులు వెంటనే బాధితుడిని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని చెప్పారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని, ఇది గంజాయి బ్యాచ్ నిర్వాహకమే అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వన్‌టౌన్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.